క్లుప్తంగా

నల్లా, బీవీవీలకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకున్న కవులు నరసింహమూర్తి, సత్యనారాయణ

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, వేదిక కన్వీనర్ బీవీవీ సత్యనారాయణలు ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ జె.విద్యాసాగర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. సాహితీ రంగంలో వారు చేస్తున్న సేవలకు గాను గౌరవ డాక్టరేట్‌లు లభించాయి. వారిద్దరినీ శ్రీశ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, వేదిక మహిళా జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అభినందించారు.

సంక్షేమాధికారి రాజుకు సత్కారం

అమలాపురం టౌన్: జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన ఉండ్రాజల రాజును జిల్లా దివ్యాంగుల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక జేఏసీ కార్యాలయంలో సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పెనుమాల నాగరాజు, నిమ్మకాయల సురేష్, గంటా గోవింద్, జనుపల్లి సంపత్‌కుమార్, కాకర రాజేశ్వరి, సుంకర రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు నడక, ఆటల పోటీలు



నడక పోటీలో పాల్గొన్న మహిళలు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కోనసీమ మహిళా మండలి కార్యాలయ ప్రాంగణంలో మహిళలకు నడక, ఆటల పోటీలు సోమవారం నిర్వహించారు. పోటీల్లో నూలు వాణి, పచ్చిగోళ్ల రత్నమాల, యక్కల సాయిలక్ష్మి, సింగంశెట్టి సుధ, బొంతు వరలక్ష్మి, మహ్మద్ రజియా విజేతలుగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, వాకర్స్ జోన్ చైర్‌పర్సన్ పచ్చిగోళ్ల సత్యకుమారి, వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, యర్రమిల్లి అనంతలక్ష్మి, విజయలక్ష్మి, రామతులసి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



మండల రజక సంఘానికి ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

ముమ్మిడివరం: స్థానిక రజక సంఘం భవనంలో మండల రజక సంఘానికి అమలాపురం రజక సంఘం అధ్యక్షుడు పేట ఏడుకొండలు అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎంపిక చేశారు. ముమ్మిడివరం మండల రజక సంఘం అధ్యక్షుడిగా ముమ్మిడివరపు రాంబాబు, ఉపాధ్యక్షుడిగా నడవపల్లి వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శిగా కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శిగా కమిడి మణికంఠ, ట్రెజరర్‌గా సామంతకుర్తి క్రాంతి కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిడి నాగేశ్వరరావు, ముమ్మిడివరపు వెంకన్నబాబు, సముదాలపాలెపు సత్యనారాయణ, గొల్లపల్లి ధర్మారావు, కోటిపల్లి మోహనరావు, సత్యవాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఈఈ రాంబాబుకు సత్కారం



రాంబాబును సత్కరిస్తున్న టీబీకే జేఏసీ కన్వీనర్ రాము తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లో జిల్లా కాపు ఉద్యోగ సేవా సమితి సమావేశం సోమవారం జరిగింది. జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి దక్షిణ భారత టీబీకే(తెలగ, బలిజ, కాపు) జేఏసీ కన్వీనర్ దాసరి రాము ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాపు ఉద్యోగులంతా సంఘటితంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ఎక్స్‌లెన్స్ సర్వీస్ ఇన్ ఇంజినీరింగ్ ఫీల్డ్ అవార్డును అందుకున్న అమలాపురం పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబును సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు ఉద్యోగ జేఏసీ నాయకులు సోమరౌతు రామకృష్ణ, లక్ష్మీపతి, నాయుడు రమేష్ పాల్గొన్నారు.

చిట్టిబ్బాయి విగ్రహావిష్కరణకు తరలి రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బులినాని

అమలాపురం టౌన్: పట్టణంలో నిర్మించిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కుడుపూడి చిట్టబ్బాయి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు, శెట్టిబలిజ నేతలు తరలి రావాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సూర్యనగర్‌లోని చిట్టబ్బాయి ఇంటి ప్రాంగణంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో బులినాని మాట్లాడారు. విగ్రహావిష్కరణకు మంగళవారం సాయంత్రం అమలాపురం వస్తున్న పార్టీ ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఆయన తొలుత అమలాపురం హైస్కూలు సెంటరులోని మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అక్కడ నుంచి పాదయాత్రగా వెళ్లి చిట్టబ్బాయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో చిట్టబ్బాయి భార్య అరుణ, కుమారులు కుడుపూడి భరత్ భూషణ్, గోపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, బండారు గోవిందు, కట్టోజు సన్న్యయ్యదాసు, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

వినికిడి లోపం పిల్లలకు మెషీన్ల పంపిణీ



వినికిడి మెషీన్లతో ప్రభావిత పిల్లలు, వారి తల్లిదండ్రులు, డైస్ సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో గల డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డైస్)లో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే) ఆధ్వర్యంలో వరల్డ్ హియరింగ్ డే సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌బీఎస్‌కే రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ వినికిడి లోపాలతో బాధపడుతున్న పిల్లలను ఆర్‌బీఎస్‌కే ఆదుకుంటోందన్నారు. అనంతరం 50 మంది వినికిడి లోపం పిల్లలకు ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు అందులో కొంతమంది పిల్లలకు వినికిడి మెషీన్లు అందజేశారు. అమలాపురంలో ఉన్న డైస్ సదుపాయాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర అన్నారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగామ్ అధికారి డాక్టర్ జాన్‌లెవీ, అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావుతోపాటు వైద్య సిబంది, వినికిడి లోపం పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణకు కృషి చేయాలి



సముద్ర తాబేళ్ల సంరక్షణపై వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

తాళ్లరేవు: పర్యావరణ సమతుల్యతకు ఎంతగానో పాటు పడే సముద్ర తాబేళ్ల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రతినిధి బండి రాజశేఖర్ కోరారు. సోమవారం కోరంగిలోని బయో డైవర్సిటీ సెంటర్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణపై చేపట్టాల్సిన చర్యలపై వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ, కస్టమ్స్, మెరైన్ తదితర శాఖల అధికారులు తాబేళ్ల పరిరక్షణకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ మత్స్యజాతులకు ఆటంకంగా ఉండే సముద్రపు గడ్డి, నాచు వంటి వాటిని తాబేళ్లు తిని పర్యావరణ సమతుల్యత చేస్తాయన్నారు. అయితే జల కాలుష్యం, కాంతి కాలుష్యం, ఫిషింగ్ తదితర కారణాలతో తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయన్నారు. తాబేళ్ల సంతానోత్పత్తి సమయంలో బీచ్‌లకు దగ్గరగా వేటను నిషేధించాలన్నారు. బయాలజిస్ట్ డి.మహేష్ బాబు మాట్లాడుతూ కాకినాడ తీరంలో ఉన్న హోప్ ఐలాండ్‌కు 5 కి.మీ విస్తీర్ణంలో జనవరి నుంచి మే వరకు వేట జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ డి.ఆశాకిరణ్, సబ్ డీఎఫ్ఓ టి.అనూష, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎం.నాగార్జున, గౌతమ్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందాం



సమావేశంలో పాల్గొన్న మాదిగ నాయకులు, కార్యకర్తలు

ఐ.పోలవరం: రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని మండల వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి లంక ఏడుకొండలు అన్నారు. మండలంలోని ఎదుర్లంక భవానీపేటలో మండల వైఎస్సార్ సీపీ మాదిగ నాయకులు, కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మాదిగలకు ఎమ్మెల్సీ పదవినిచ్చి సముచిత స్థానం కల్పించారన్నారు. అందుకే మండలానికి చెందిన మాదిగలంతా వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌ను మళ్లీ గెలిపించుకోవాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో బడుగు శ్రీను, సవరపు శ్రీహరి, జొన్నాడ అజయ్, సవరపు కన్నబాబు, జేడీ సూర్యనారాయణ, మందపల్లి రాంబాబు, ఆకుమర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. సోమవారం ఆయన ఆది ద్రావిడ సంక్షేమ శాఖ నిధులు రూ.1.55 కోట్లతో చేపట్టనున్న సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముందుగా బెజవాడ గార్డెన్స్ మొదటి వీధి, మూడో వీధి, భీమ్‌నగర్, మెట్టకూరు ఆదిఆంధ్రపేట, వాసవీనగర్, నవాజ్‌గార్డెన్స్, రాజరాజేశ్వరీనగర్, కమిడి అండ్ చెల్లెగార్డెన్స్, త్యాగరాజవీధి, దొమ్మేటిపేట, దరియాలతిప్పల్లో అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఏఓ కె.రామకృష్ణ, పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్, ఏఈ కె.నాగరాజు, మున్సిపల్ ఏఈ కుమార్ పాల్గొన్నారు.

7న పి.గన్నవరంలో మెగా జాబ్ మేళా



మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన పి.గన్నవరం లక్ష్మీ ఐటీఐ కళాశాలలో మెగా జాబ్ మేళా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షుశుక్లా మాట్లాడుతూ జాబ్ మేళాలో 850 ఖాళీలు భర్తీ చేయడానికి సుమారు 14 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ నుపూర్ అజయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ శివప్రసాద్, జిల్లా పరిశ్రమల మేనేజర్ ప్రసాద్, నైపుణ్యాభివృద్ధి సంస్థ డీఎస్‌డీవో లోకమాన్, నాగబాబు, రాజ్ కుమార్, వికాస పీడీ రమేష్ పాల్గొన్నారు.

ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు శుభ్రం చేయాలి



మెగా డ్రైవ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ఈ నెల 6వ తేదీన మెగా డ్రైవ్‌లో భాగంగా మండలంలోని 59 ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, కార్యదర్శులతో సోమవారం తాగునీటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ మార్చి 6న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల లోపు ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించాలన్నారు. ట్యాంక్‌లకు అవసరమైన బ్లీచింగ్, సిబ్బందిని సమకూర్చుకోవాల్సిన బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌కుమార్, ఏఈ స్వామి, ఈఓపీఆర్డీ ఎస్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు రాజమోహన్, రాజా, పి.శ్రీనివాస్, చిక్కం శ్రీను, కేవీవీ సత్యనారాయణ, దుర్గా శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

అతి తక్కువ వడ్డీకే రుణాలు



మెగా క్రెడిట్ ఔట్రీచ్ కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ హెడ్ మనోహర్ తదితరులు

అమలాపురం రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అతి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తుందని బ్యాంకు రీజనల్ హెడ్ కాకి సాయి మనోహర్ అన్నారు. మండలంలోని కొంకాపల్లి బ్రాంచ్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెగా క్రెడిట్ ఔట్రీచ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ రంగారావు, నారాయణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలి

యానాం: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టణ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లోని ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లను రెండు రోజుల్లోగా తొలగించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్.మునిస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నివాసాలు, షాపులు తదితర ప్రదేశాల్లో వాటిని తొలగించకపోతే ప్రభుత్వ సిబ్బంది తొలగించి దాని నిమిత్తం అయ్యే ఖర్చులను సంబంధిత వ్యక్తుల నుంచి, ఆయా సంస్థల నుంచి వసూలు చేస్తామన్నారు. అదేవిధంగా తొలగించిన సామగ్రి తిరిగి వారికి ఇవ్వడం జరగదన్నారు.

మండల పరిషత్ నిధులతో రహదారుల అభివృద్ధి



సీసీ రహదారికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ సునీత తదితరులు

తాళ్లరేవు: మండల ప్రజా పరిషత్ నిధులతో అంతర్గత రహదారులు అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. సోమవారం తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని పెంకేవారిపేట కాలనీలో రూ.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి ఎంపీపీ సునీత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు పంచాయతీల్లో దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామంలో మరికొన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చిట్టూరి లలిత పద్మ, పంచాయతీ కార్యదర్శి నున్న శంకరనారాయణ, సచివాలయ కార్యదర్శి టి.వేణుగోపాల్, రాయుడు గంగాధర్, చిట్టూరి చలపతి, పిల్లి మణికంత, గీసాల ప్రసాద్, మేడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో పారిశుధ్య పనులు



రాత్రి వేళల్లో పారిశుధ్య పనులను జెండా ఊపి ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: పట్టణంలోని వాణిజ్య కూడళ్లు, రోడ్లపై ఇక నుంచి రాత్రి సమయాల్లో చేపట్టే పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ప్రారంభించారు. పట్టణంలో వ్యాపార దుకాణాలున్న రోడ్లలో ఉదయం జరిగే పారిశుధ్య పనులను ప్రయోగాత్మకంగా రాత్రికి మార్చారు. ఫలితాలు బాగుండడంతో సోమవారం నుంచి పూర్తి స్థాయిలో రాత్రి సమయాల్లో పనుల అమలుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.మనోహర్, ఏఈ వెంకటేష్, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు వినతి

అమలాపురం రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ హిమాన్షు శుక్లాకు డ్వాక్రా వెలుగు యానిమేటర్లు(వీవోఏలు) సోమవారం స్పందన కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందజేశారు. వీవోఏలకు అందరికీ హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి, శ్యామల, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



కొండబాబు భార్యకు చెక్కును అందిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: కోనసీమకు చెందిన జంగా కొండబాబు ఉపాధి నిమిత్తం విదేశాల్లో డ్రైవర్‌గా పనిచేసేవాడు. జనవరి 24వ తేదీన మస్కెట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు మృతి చెందాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కొండబాబు కుటుంబీకులను ఆదుకోవడానికి విదేశాల్లో పనిచేస్తున్న ఏపీ యూత్ సభ్యులు ముందుకొచ్చి రూ.1.20 లక్షలు సమకూర్చారు. కొండబాబు భార్య గౌతమికి సదరు మొత్తానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు.

28న బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

యానాం: అంబేడ్కర్ 127వ జయంతోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 28న పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలను యానాంలో నిర్వహించనున్నట్లు యానాం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాళ్ల జీవన్ ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాంపియన్ షిప్ కప్‌ను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

బలవంతంగా ఆస్తి రాయించుకున్నారు

అమలాపురం రూరల్: ముమ్మిడివరం నియోజకర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ బలవంతంగా తన ఆస్తి రాయించుకున్నాడంటూ ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన డాక్టర్ అంజరపు ఫ్రాంక్లిన్ కెల్లీ జాషువా సోమవారం కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అమెరికాలో డాక్టర్‌గా పనిచేస్తున్న తాను అల్లవరం మండలం బెండమూర్లంకలో ఆసుపత్రి నిర్మాణానికి 14 ఎకరాలు కొనుగోలు చేసి సదరు ఆస్తి ఒరిజినల్ డాక్యుమెంట్లను విశాఖలోని వెంకోజీపాలెంలో ఉన్న తన ఫ్లాట్‌లో ఉంచానన్నారు. తన స్నేహితుడు గుత్తుల సర్వేశ్వరరావు, కారు డ్రైవర్ పరమట రాజశేఖర్‌లు ఫ్లాట్ తాళాలు తీసి డాక్యుమెంట్లను ఓ బంగారం వ్యాపారి వద్ద తనఖా పెట్టి డబ్బులు తీసుకున్నారన్నారు. అనంతరం తాను విశాఖకు వచ్చినపుడు పితాని బాలకృష్ణ వాల్తేరు క్లబ్‌కు పిలిచి బలవంతంగా ఖాళీ నోట్‌లపై సంతకాలు తీసుకుని భూమిని రాయించుకున్నారని ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు.

జాబ్ మేళాకు 60 మంది హాజరు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

యానాం: స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు 60 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రుచితా, జీఆర్ అసోసియేట్స్ ఏజెన్సీస్, ఓరియంటల్ ఎలక్ట్రానిక్స్, ప్రీమియర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, స్పైడర్ ఎలక్ట్రికల్స్ తదితర కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 32 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ముమ్మిడివరం నగర పంచాయతీ బొండాయికోడు సమీపంలో ఆదివారం రాత్రి భీమవరానికి చెందిన సాలినాని(25), రాపాక సుబ్బారావు(25) మోటారు సైకిల్‌పై అమలాపురం వైపు వెళుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వారిలో నాని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ మేరకు ఎస్ఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టీ క్లీన్ వాహనాల అందజేత



కార్మికులకు వాహనాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వ నమస్తే ప్రోగ్రామ్ ద్వారా రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీకి చెందిన ముగ్గురు కార్మికులకు మూడు వాక్యూమ్ సక్షన్ డీస్లడ్జింగ్ వెహికల్స్(సెప్టీ క్లీన్)లు మంజూరయ్యాయి. సదరు వాహనాలను స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో కార్మికులకు చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్ సోమవారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ ఒక్కో వాహనం రూ.31.67 లక్షల వ్యయంతో మూడు వాహనాలకు మొత్తం రూ.95.01 లక్షల విలువైన వాహనాలను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వెంకటేష్, ఎస్సీ కార్పొరేషన్ ఏఈవో రాజు పాల్గొన్నారు.

తృతీయ వార్షికోత్సవం

యానాం: పట్టణ పరిధిలోని అగ్రహారంలో సోమవారం అచల పరిపూర్ణ లక్ష్మీనారాయణ ఆశ్రమం తృతీయ వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాడి భజే నారాయణదాసు సద్గురు సత్యానందం ఆధ్వర్యంలో అగ్రహారం శిష్యబృందంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విష్వక్షేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, మండపారాధన, కుంభపూజ, అభిషేకం, అగ్నిప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సతీమణి ఉదయలక్ష్మి హాజరయ్యారు.

సౌరయాగంలో చండీ హోమం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో నిర్వహిస్తున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగంలో సోమవారం 24వ రోజు చండీ హోమం ఘనంగా నిర్వహించారు. యాగకర్త మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఋత్విక బృందం జ్యేష్ఠ నక్షత్ర జాతకులతో పోక చెట్టుకు పూజలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వినతి పత్రం అందజేత

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో పంట బోదెల సమస్యను పరిష్కరించాలంటూ తహసీల్దార్ టి.మల్లికార్జునరావుకు గ్రామానికి చెందిన చిక్కం శ్రీనివాస్, దుర్గారావులు సోమవారం వినతి పత్రం అందజేశారు. కొంత మంది రైతులు బోదెలను ఆక్రమించడంతో వర్షాకాలంలో నీరు దిగువకు దిగక చుట్టుపక్కల నివాసాలకు ఇబ్బందిగా మారిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ముమ్మిడివరం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పేపర్-1 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక మోకా గణపతిరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 365 మందికి గాను 341 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అలాగే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 308 మందికి గాను 286 మంది, తారా కళాశాలలో 235 మందికి గాను 216 మంది పరీక్షలకు హాజరైనట్లు కస్టోడియన్ డి.వి జయ్‌కుమార్ తెలిపారు.